
సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



సుందరగిరి.. ఆధ్యాత్మిక ఝరి

శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. IIలో ▸



అన్న చేతిలో తమ్ముడి హతం

ఒక సెంటు స్థలం విషయంలో జరిగిన గొడవలో తమ్ముడిని అన్నయ్య హత్యచేశాడు. కాళ్ల మండలంలోని పెదఅమిరంలో ఈ హత్య జరిగింది. IIలో ▸



ఉసురు తీసిన అతివేగం

ఆగి ఉన్న లారీని కంటైనర్ ఢీకొనడంతో ఇద్దరు కూలీలు మృతిచెందారు. ఉంగుటూరు మండలం నాచుగుంట వద్ద గురువారం వేకువజామున ఈ ప్రమాదం జరిగింది. IIలో ▸

న్యూస్‌రీల్

30 రోజులకు రూ.3.11 కోట్ల ఆదాయం



హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో గురువారం అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. ఈ లెక్కింపులో చిన వెంకన్నకు విశేష ఆదాయం సమకూరింది. గత 30 రోజులకు నగదు రూపేణా స్వామికి రూ. 3,11,12,331 ఆదాయం లభించినట్టు ఆలయ ఇన్‌చార్జి ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 305 గ్రాముల బంగారం, 6.455 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులోకి రాని రద్దైన పాత రూ.2000, రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ.62,000 లభించినట్టు చెప్పారు.

19 నుంచి టీటీసీ పరీక్షలు

భీమవరం: ఫిబ్రవరిలో నిర్వహించే టీటీసీ పరీక్షల టైం టేబుల్ డైరెక్టర్ ఆఫ్ ప్రభుత్వ పరీక్షల విభాగం విడుదల చేసినట్లు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు 19 నుంచి 22 వరకు రోజూ ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు జరుగుతాయన్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ పరీక్షలు 19 నుంచి 20 వరకు ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యాయర్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎవరి కుట్టుమిషన్ వారే తెచ్చుకోవాలని స్పష్టం చేశారు.

పంటు రేవులో ఏర్పాట్ల పరిశీలన



పంటు రేవులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

నరసాపురం: అంతర్వేది యాత్రికులకు ఇబ్బందులు రాకుండా కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ నయీం అస్మి ఆదేశించారు. గురువారం పట్టణంలోని పడవలరేవును తనిఖీ చేశారు. పంటుపై ప్రయాణించి భద్రతా లోపాలు పరిశీలించారు. ఎస్పీ పలు సూచనలు చేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రేవును తనిఖీ చేసిన అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. ఆయన వెంట ఏఎస్పీ భీమారావు, నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, సీఐలు యాదగిరి, శ్రీనివాస్, ఎస్సైలు ముత్యాలరావు, జయలక్ష్మి ఉన్నారు.

అంతర్వేది ఉత్సవాలకు 30 ప్రత్యేక బస్సులు

నరసాపురం: అంతర్వేది శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ ఉత్సవాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి చెప్పారు. 7, 8న నరసాపురం డిపో నుంచి 10 బస్సులు తిప్పుతున్నామని చెప్పారు. జిల్లాలోని భీమవరం డిపో నుంచి 15 బస్సులు, తణుకు డిపో నుంచి 5 బస్సులు, తాడేపల్లిగూడెం డిపో నుంచి 5 బస్సులు తిప్పుతున్నామని వివరించారు. అవసరాన్ని బట్టి మరిన్ని సర్వీస్‌లు పెంచుతామన్నారు. పాలకొల్లు బస్టాండ్ నుంచి ప్రతి 10 నిమిషాలకు ఓ బస్సు అంతర్వేది వెళ్లేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలి



కల్లుగీత కార్మికుల సంఘాల నాయకులతో మాట్లాడుతున్న కుమరేశ్వరన్

భీమవరం: గీత కులాలు ఆర్థికంగా ఎదగడానికి మద్యం దుకాణాలు ఉపయోగపడతాయని అందువల్ల ప్రభుత్వం గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ ఆర్‌ఎస్ కుమరేశ్వరన్ చెప్పారు. గురువారం కల్లుగీత కార్మికుల సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 10న కలెక్టర్ కార్యాలయంలో లాటరీ ద్వారా కేటాయిస్తారని చెప్పారు.

కూటమి కుప్పిగుంతలు

- జిల్లాలో నాసిరకంగా రోడ్ల మరమ్మతులు
- గుంతల్లోంచి పైకి లేస్తున్న కంకర రాళ్లు
- రోడ్లను కమ్మేస్తున్న బూడిద
- రాకపోకలకు ప్రయాణికుల ఇక్కట్లు



నౌడూరు జంక్షన్ సమీపంలో కమ్మేస్తున్న బూడిద

సాక్షి, భీమవరం: రోడ్లకు కనీస మరమ్మతులు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఆపసోపాలు పడుతోంది. జిల్లాలో 698 కి.మీ మేర ఆర్‌అండ్‌బీ రోడ్లకు ప్యాచ్ వర్కులు, అత్యవసర మరమ్మతుల నిమిత్తం జిల్లాకు రూ.42.57 కోట్లు మంజూరు చేసింది. వీటిలో స్టేట్ హైవే (ఎస్‌హెచ్) రోడ్లలో రూ.10.45 కోట్ల విలువైన 41 పనులు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల(ఎండీఆర్)లో రూ. 32.12 కోట్ల విలువైన 140 పనులు ఉన్నాయి. తొలుత సంక్రాంతికి గుంతలన్నవే లేకుండా చేస్తామని ప్రకటించగా సగం పనులు పూర్తి చేయలేదు. జనవరి నెలాఖరు నాటికని, ఇప్పుడు ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని చెబుతున్నారు. ఇంతవరకు 60 శాతం మేర పనులు పూర్తయినట్టు అంచనా. దాదాపు 20 వరకు పనులు ఇంకా మొదలుకానున్నాయి.

నాసిరకంగా పనులు : నిర్ణీత ప్రమాణాలు పాటించకుండా చాలాచోట్ల నాసిరకంగా పనులు చేస్తున్నారు. కొన్ని చోట్ల గుంతల్లో కంకర, చిప్స్ వేసి తారు వేయకుండా వదిలేశారు. వాహనాల తాకిడికి రాళ్లు పైకిలేచి రోడ్డంతా చెల్లాచెదురై ప్రమాదభరితంగా తయారవుతున్నాయి. ద్విచక్ర వాహనచోదకులు అదుపు తప్పి ప్రమాదాల పాలవుతున్నారు.



ఈ చిత్రాన్ని గమనించారా..? దారి కనిపించనంతగా రోడ్డంతటిని పొగ మంచు దట్టంగా కమ్మేసిందనుకుంటే పొరపాటే. వీరవాసరం–పెనుమంత్ర ఆర్‌అండ్‌బీ రోడ్డులోని నౌడూరు సమీపంలో కొద్దిరోజుల క్రితం కూటమి ప్రభుత్వం పూడ్చిన గుంతల్లోంచి వస్తున్న బూడిద. గుంతల్లో కంకర, బూడిద వేసి వదిలివేయడంతో వాహనాలు వెళ్లే సమయంలో బూడిద పైకి లేచిపోయి వెనుక వచ్చే వారికి దారి కనిపించకుండా రోడ్డంతటిని కమ్మేస్తుండటంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చుట్టుపక్కల షాపుల్లోకి బూడిద చేరుతోంది. సీసీ రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించిన పనులు చేయడం లేదని స్థానికులు అంటున్నారు.

నియోజకవర్గాల వారీగా రోడ్ల మరమ్మతుల వివరాలు

నియోజకవర్గం	మొత్తం పనులు	కిలోమీటర్లు	మంజూరు మొత్తం (రూ.కోట్లలో)
భీమవరం	29	77.42	8.61
ఉండి	39	151.88	12.25
పాలకొల్లు	18	73.59	3.64
ఆచంట	25	97.38	3.33
తాడేపల్లిగూడెం	29	142	6.9
నరసాపురం	15	55	2.97
తణుకు	14	56.8	2.35
ఉంగుటూరు మండలం	12	43.9	2.52



భీమవరం-తాడేపల్లిగూడెం రోడ్డులోని యండగండి సమీపంలో రోడ్డు దుస్థితి



ఈడూరు-తణుకు రోడ్డులోని మరమ్మతుల దుస్థితి



కొండేపూడి-అండలూరు రోడ్డులోని దుస్థితి

రుణాల మంజూరులో సహకరించాలి

కలెక్టర్ సి. నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): రైతులకు రుణాల మంజూరులో సహకార సంఘాలు సాయం అందించాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలలో ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపరచడానికి రుణాలు మంజూరు చేయాలన్నారు. జనవరి నెలలో వార్షిక ప్రణాళికపై చర్చ, ఫిబ్రవరిలో డిజిటలైజేషన్, కౌలు రైతులకు రుణాలు, మార్చిలో స్టూడెంట్స్ అవగాహన కార్యక్రమాలు, ఏప్రిల్‌లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు వంటివి నిర్వహిస్తున్నామన్నారు. అన్ని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలలో కంప్యూటరీకరణ ఫిబ్రవరి 15 లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సహకారం రంగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులు, జన ఔషధిపై ప్రతి నెల పర్యవేక్షణ ఉండాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలయ్యేలా పర్యవేక్షణ ఉండాలన్నారు. పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణా కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వట్లూరు సర్. సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసే రిసెప్షన్ సెంటర్‌లో అవసరమైన లైటింగ్‌ను సిద్ధం చేసుకోవాలన్నారు. మార్చి 3న నిర్వహించే కౌంటింగ్‌కు సూపర్‌వైజర్లు తదితర ఓట్ల లెక్కింపు సిబ్బంది నియామకాలను పూర్తిచేసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో మీడియా రూమ్ ఏర్పాట్లపై సమీక్షించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈని ఆదేశించారు. కృష్ణ -గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల ఏర్పాట్లు కూడా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం: హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తూ భీమవరం పట్టణంలో గురువారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వాహన చోదకులంతా రహదారి భద్రతా నియమాలను పాటించాలని చెప్పారు. పోలీసులు, రవాణ సిబ్బంది జరిమానాలు విధిస్తున్నారనే భయంతో గాకుండా సామాజిక బాధ్యతగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 15 వరకు పోలీసు, రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజలకు రహదారి భద్రతా నియమాలు, హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా భీమవరం ఆర్టీసీ బస్టాండ్ నుంచి జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ వి.భీమారావు, జిల్లా రవాణా శాఖాధికారి టి.ఉమామహేశ్వరరావు, భీమవరం డీఎస్పీ రావూరి గణేష్ జయసూర్య, తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీలో కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అస్మి తదితరులు

ఫ్యాక్టరీ సీజ్‌కు ఆదేశాలివ్వండి

తణుకు అర్బన్: ప్రజా జీవనానికి గుదిబండగా మారిన పశువధ శాల ఇప్పటికే రెండు ప్రాణాలు బలితీసుకుందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి అన్నారు. భూమి లీజుకిచ్చిన సీనియర్ న్యాయవాది గతంలోనే మృతి చెందగా, తాజాగా ఈ వ్యవహారంలో ఎస్సై ఏజీఎస్ మూర్తి ఆత్మహత్య చేసుకున్నారని చెప్పారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సీజ్ ద షిప్ అన్న పదం వైరల్ అయ్యిందని, తణుకు ఎమ్మెల్యే ఆటో డ్రైవర్ వ్యవహారంలో సీజ్ ద ఆటో అనే వార్త కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యిందని, చివరగా ఒకే ఒక్కసారి సీజ్ ద ఫ్యాక్టరీ అనే మాటను తణుకు ఎమ్మెల్యే అంటే వినాలని ఉందని ఎద్దేవా చేశారు. పాలిచ్చే మూగజీవాలను హింసించి చంపడం తణుకు ప్రాంతానికి అరిష్టమని, పశువధ కారణంగా నీరు, గాలి, ఆహారం కూడా కలుషితమవుతుందని.. స్థానిక పాలకులు పట్టించుకోకుండా వ్యవహరించడం అనుమానాస్పదంగా ఉందని అన్నారు. వారం రోజుల్లో నివేదిక ఇస్తానన్న జిల్లా కలెక్టరు సైతం ఇంతవరకు ఆ విషయంపై మాట్లాడకపోవడం బాధాకరమని అన్నారు. కూటమి ఒత్తిడి కారణంగా నడుస్తున్న ఈ పశువధ శాలకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో యుద్ధం ప్రారంభిస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, పార్టీ నేత వి.సీతారాం మాట్లాడుతూ అనుమతులు సక్రమంగా ఉన్నా స్థానికంగా ప్రజలకు ఇబ్బందులు తలెత్తే ఎటువంటి పరిశ్రమలు కూడా నడిపేందుకు కుదరదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు వీరమల్లు ఫణీంద్రకుమార్, నాయకులు మారిశెట్టి శేషగిరి, చింతన్న పాల్గొన్నారు.



తణుకులో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యుడు సాయిబాబా రెడ్డి

10వ తేదీ వరకు ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ

ఏలూరు(మెట్రో): తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 3 నుంచి 10 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నేగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్ 1881 ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులు అనుసరించి 8న రెండో శనివారం, 9న ఆదివారం తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లు స్వీకరించరని తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి తెలిపారు.

యూపీ, రాజస్థాన్‌లో ఖాకీ వేట

కార్తీ నటించిన 'ఖాకీ' సినిమా చూస్తుంటే రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ఏలూరు నగరంలో జరిగిన బంగారం షాపులో చోరీ కేసు ఛేదనలో పోలీసులు చేసిన సాహసం ఆ సినిమా సన్నివేశాలకు ఏ మాత్రం తీసిపోదు. ఆ సినిమాలో రాజస్థాన్, యూపీకి చెందిన కరుడుగట్టిన నేరస్తులను పట్టుకునేందుకు పోలీసులు ప్రాణాలకు తెగించి పోరాడతారు. వాటిని గుర్తు చేసేలా ఏలూరు జిల్లా పోలీసులు ఈ కేసును అత్యంత చాకచక్యంగా ఛేదించారు.

- కరుడుగట్టిన అంతర్రాష్ట్ర నేరస్తుల ముఠా అరెస్ట్
- యూపీ, రాజస్థాన్‌లో వేట కొనసాగించిన ఏలూరు పోలీసులు
- 25 రోజుల్లో కేసు ఛేదన

ఏలూరు టౌన్: ఏలూరు లోకేశ్వరి గోల్డ్‌షాప్‌లో జరిగిన చోరీ కేసులో పోలీసులు రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లి కీలక వివరాలు సేకరించి అక్కడ నిందితులను అదుపులోకి తీసుకున్నారు. యూపీ, రాజస్థాన్‌లోని తీవ్ర ప్రతికూల వాతావరణంలో.. అనారోగ్యం బారిన పడినా, తిండి సహించక ఇక్కట్లు ఎదుర్కొన్నా విధి నిర్వహణపై శ్రద్ధతో అంతర్రాష్ట్ర నేరస్తుల ముఠాకు చెక్ పెట్టారు. ఈ కేసును ఛేదించేందుకు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వ్యూహ రచన చేయగా.. జిల్లాకు చెందిన పోలీస్ టీం 25 రోజుల్లోనే ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌కు చెందిన నేరగాళ్ల ముఠాను అరెస్ట్ చేసింది.

సూత్రధారి రాజేష్ కుశ్వాహ్..

ఉత్తరప్రదేశ్‌లోని జగ్నేర్ తహసిల్, బిడౌలీ గ్రామానికి చెందిన కుల్దీప్ శర్మ, రాజస్థాన్‌లోని ధోలాపూర్ జిల్లా మానియాకు చెందిన మనోజ్‌కుమార్, ఉత్తర ప్రదేశ్ అజీజ్‌పూర్‌కు చెందిన మహేందర్ సింగ్, రాజేష్ కుశ్వహ్ అలియాస్ తీటు ఏలూరు తాపీమేస్త్రీ కాలనీలో ఉండేవారు. ఒక్కో ఏరియాలో కొన్ని రోజులుగా భారీ చోరీలకు ప్లాన్ చేస్తారు. ఈ ప్లానింగ్ రాజేష్ కుశ్వాహ్ అలియాస్ తీటు కీలకం.. ఏలూరు వన్‌టౌన్‌లో ఉన్న లోకేశ్వరి గోల్డ్ షాప్‌కు కన్నం వేసి జనవరి 11న దుండగులు భారీగా బంగారు, వెండి వస్తువులు దోచుకెళ్లారు.

రాజస్థాన్, యూపీల్లో వేట : రెండు సంచుల్లో బంగారు, వెండి వస్తువులను కట్టుకుని బైక్‌పై పారిపోయారు. కంగారులో సీసీ కెమెరా ఫుటేజ్ ఉన్న డీవీఆర్ కాకుండా సెట్‌టాప్ బాక్స్‌ను ఎత్తుకుపోయారు. కెమెరా ఫుటేజ్‌లో దొంగలను గుర్తించిన పోలీసులు నగరంలోని అన్ని కెమెరాల సీసీటీవీ ఫుటేజ్‌ను జల్లెడ పట్టారు. నేరస్తులు ఏలూరు లోబ్రిడ్జి, సుబ్బమ్మదేవి స్కూల్, కండ్రికగూడెం మీదుగా చొదిమెళ్ళ వెళ్లినట్లు గుర్తించారు. జాతీయ రహదారి మీదుగా విజయవాడ రైల్వే స్టేషన్ చేరుకుని, అక్కడ బైక్ పార్కింగ్‌లో పెట్టి రాజస్థాన్ రైలు ఎక్కారు. రైల్వే పోలీసుల సాయంతో అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి ఏ ట్రైన్ ఎక్కారో నిర్ధారించుకున్నారు. ట్రైన్‌లో రాజస్థాన్‌లోని ధోలాపూర్‌కు వెళ్లినట్లు తెలియడంతో అక్కడకు వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా తదితర ప్రాంతాల్లో చలిగాలుల్లో నిందితుల కదలికలపై ఆరా తీయటం ప్రారంభించారు. 15 రోజులకు పైగా తీవ్రమైన చలిగాలుల వల్ల పోలీసు అధికారులు అనారోగ్యం బారిన పడ్డారు. కొన్నిసార్లు ఆహారానికి ఇబ్బంది ఎదుర్కొన్నారు. దొంగల కేంద్రంగా చెప్పుకునే రాజస్థాన్‌లో భరత్‌పూర్ వెళ్లడం ప్రాణాలతో చెలగాటమే. పోలీస్ బృందాలకు ఎస్పీ అండగా ఉంటూ అక్కడి పోలీస్ అధికారులతో మాట్లాడుతూ తీవ్రంగా శ్రమించారు.



చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ శివకిషోర్

ప్రత్యేక టీం ఏర్పాటు

ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ టీంను నియమించారు. వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, ఎస్‌బీ సీఐ బి.ఆదిప్రసాద్, సీసీఎస్ సీఐ రాజశేఖర్, గణపవరం సీఐ ఎంవీ సుభాష్, ఎస్సైలు ఎస్‌కే మదీనాబాషా, సూర్యభగవాన్, పీసీలు మోహన్‌కృష్ణ, నాగార్జున, నాగరాజు పోలీస్ టీంలో ఉన్నారు.

నగరంలో పదికి పైగా చోరీలు

ఎట్టకేలకు యూపీలోని ఒక గ్రామంలో ఆరాతీయగా కుల్దీప్ శర్మ ఫోన్ నంబర్ లభించింది. పథకం ప్రకారం అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతన్ని తమదైన శైలిలో విచారించగా.. ఏలూరు తాపీమేస్త్రీ కాలనీలో ఉంటూ బంగారు నగలు తయారు చేసే పనిలో ఉన్న రాజేష్ కుశ్వాహ్ విషయాన్ని వెల్లడించాడు. ఏలూరులో పోలీసు అధికారులు అప్రమత్తమై రాజేష్‌ను అరెస్టు చేశారు. అతన్ని విచారించగా అంతర్రాష్ట్ర నేరస్తుల ముఠా గుట్టు వెల్లడైంది. మనోజ్ కుమార్‌ను రాజస్థాన్‌లో.. మహేంద్రసింగ్‌ను యూపీలో అరెస్టు చేశారు. రాజేష్ చోరీలకు పక్కా స్కెచ్ వేస్తాడు. తమ వారిని పిలిపించి నగరంలో చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. రెండు, మూడేళ్లుగా నగరంలో పదికి పైగా చోరీలకు పాల్పడినట్లు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి. వీరిని అరెస్టు చేసి 469 గ్రాముల బంగారు ఆభరణాలు, 41 కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. లోకేశ్వరి జ్యూయలరీ షాపులో చోరీతో పాటు నగరంలోని ఇతర కేసుల్లోని బంగారు, వెండి వస్తువులు పోలీసులు రికవరీ చేశారు. నిందితులపై పాత కేసులు ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. మహేందర్ సింగ్‌ను ప్రమాదకరమైన నేరస్తుడిగా పోలీసులు గుర్తించారు.

సుందరగిరి.. ఆధ్యాత్మిక ఝరి

నమో నారసింహ

- సుందరగిరిపై 'నారసింహుని' పెళ్లి సందడి
- రేపటి నుంచి ఐఎస్ జగన్నాథపురంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభం
- 6 రోజుల పాటు జరగనున్న ఉత్సవాలు
- 10న స్వామివారి కల్యాణం
- వేడుకలకు పూర్తయిన ఏర్పాట్లు



సుందరగిరిపై శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయం



గర్భాలయంలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహుడు



ఆలయం వద్ద ప్రత్యేకంగా నిర్మించిన తాత్కాలిక క్యూలైన్లు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరి పర్వతంపై.. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. భీష్మ ఏకాదశి పర్వదినం మొదలుగా ఆరు రోజుల పాటు ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. అందులో భాగంగా ద్వారకాతిరుమల దేవస్థానం అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం షామియానా, చలువ పందిళ్లు, ప్రత్యేక దర్శనం క్యూలైన్లను నిర్మించారు. అలాగే విద్యుద్దీప అలంకారాల పనులు పూర్తయ్యాయి. ఉత్సవాలు జరిగే రోజుల్లో రాత్రి 7 గంటల నుంచి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఇదిలా ఉంటే ఆహ్లాదకర వాతావరణంలో, పూజల ప్రాశస్త్యం గల ఈ ఆలయాన్ని సందర్శిస్తే కోరిన కోర్కెలు తీరి, సకల శుభాలు కలుగుతాయన్నది భక్తుల నమ్మకం. అందుకే ఏటా ఏకాదశి వంటి పర్వదినాల్లో వేలాదిగా భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు. దినదినాభివృద్ధి చెందుతున్న దేవస్థానం ప్రతి ఏటా స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తోంది.

క్షేత్ర విశిష్టత

మతంగి మహర్షి తపస్సు ఫలితంగా ఈ సుందరగిరి పర్వతంపై శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారు స్వయంభూగా, శాలిగ్రామ రూపంలో వెలిశారు. ఇప్పటికీ మతంగి మహర్షి సర్ప రూపంలో స్వామివారిని నిత్యం సేవిస్తారని ప్రతీతి. ఆలయం వెనుక ఎన్నో ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఉన్న పుట్ట ఇందుకు సాక్ష్యమని ఆలయ అర్చకులు చెబుతున్నారు. ప్రతి ఏటా మహా శివరాత్రి పర్వదినం నాడు నరసింహ గురుజీ ఆధ్వర్యంలో మహా సుదర్శన యాగాన్ని పెద్ద ఎత్తున జరుపుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేశాం



నారసింహుని దివ్య కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేశాం. ఈ వేడుకల్లో పాల్గొనే వీఐపీలతో పాటు సాధారణ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. కొండ కింద కల్యాణ మండపంలో ఈనెల 10న స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించనున్నాం. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని, స్వామివారిని దర్శించి, తరించాలి.

– వేండ్ర త్రినాధరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ

ఉత్సవ విశేషాలు

- 8వ తేదీ ఉదయం 10.20 గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేస్తారు.

సాంస్కృతిక కార్యక్రమం : శ్రీ కృష్ణ రాయబారం నాటకం

- 9న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు నిత్య పూజలు, హోమాలు, మూలమంత్ర హవనములు, బలిహరణ, వేద పారాయణ, నిత్య హోమాలు, మండప పూజలు, హారతి, మంత్ర పుష్పములు జరుగుతాయి.

సాంస్కృతిక కార్యక్రమం : కూచిపూడి నృత్య ప్రదర్శన

- 10వ తేదీ ఉదయం 11.10 గంటలు నుంచి స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం

సాంస్కృతిక కార్యక్రమం : రామాంజనేయ యుద్ధం నాటకం

- 11న సాయంత్రం 6.30 గంటల నుంచి స్వామివారి గ్రామోత్సవం

సాంస్కృతిక కార్యక్రమం : కోలాట భజనలు

- 12 న ఉదయం 8 గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, వసంతోత్సవం, సాయంత్రం 7 గంటలకు ధ్వజావరోహణ

సాంస్కృతిక కార్యక్రమం : హరికథ

- 13 న రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవ వేడుకలు

సాంస్కృతిక కార్యక్రమం : సత్యహరిశ్చంద్ర నాటకం.

క్లుప్తంగా

దేశ అభ్యున్నతికి పరిశోధనలే కీలకం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: దేశ అభ్యున్నతికి పరిశోధనలే కీలకమని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్వీ రమణరావు అన్నారు. నిట్ విద్యాసంస్థలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉల్లాస్ జీ కల్చరల్ ఫెస్ట్ 2k25 కార్యక్రమాన్ని గురువారం రాత్రి ప్రారంభించారు. ప్రొఫెసర్ ఎన్వీ రమణారావు మాట్లాడుతూ విజ్ఞానం, వినోదం మేళవించే ఈ ఉత్సవాలని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను, సృజనాత్మక ఆలోచనలను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు నూతన సాంకేతికతలపై పట్టు సాధించడంతో పాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్, శంకర్‌రెడ్డి, డీన్లు డాక్టర్ కే.హిమబిందు, డాక్టర్ ఎస్.జయరామ్, డాక్టర్ వీరేష్ కుమార్, అసోసియేట్ డీన్ తలారి రేష్మా, ఆచార్యులు గుర్రాల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దిరుసుమర్రులో నిధుల దుర్వినియోగంపై విచారణ



సచివాలయంలో సర్పంచ్, కార్యదర్శులను విచారిస్తున్న ఇన్‌చార్జి డీఎల్‌పీవో బాలాజీ

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఇన్‌చార్జి డీఎల్‌పీవో బాలాజీ గురువారం విచారణ చేపట్టారు. రెండు నెలల క్రితం సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, కార్యదర్శి కృష్ణమోహన్ పంచాయతీ నిధులు సుమారు రూ.2 కోట్లు దుర్వినియోగం చేశారని, పాలకవర్గం ఏర్పాటైన పంచాయతీ ఖర్చుల వివరాలు అజెండాలో చూపడం లేదని, పంచాయతీకి చెల్లించిన సొమ్మును సొంత ఖాతాల్లో వేసుకుంటున్నారని, కొత్తగా కుళాయిలు మంజూరు చేసి ఒక్కో కుళాయికి రూ. 4 వేలు వసూలు చేసి పంచాయతీ ఖాతాకు జమ చేయలేదని తదితర 21 అంశాలపై ఉప సర్పంచ్ ఆల్లూరి గంగాధరరాజు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు విచారణ చేసిన ఇన్‌చార్జి డీఎల్‌పీవో ఉన్నతాధికారులకు విచారణ నివేదిక అందిస్తామని తెలిపారు.

నరసాపురంలో చైన్‌స్నాచింగ్

నరసాపురం: నరసాపురం పట్టణంలో మహిళ మెడలో బంగారు గొలుసును చైన్‌స్నాచింగ్ చేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం రుస్తుంబాద వద్ద 216 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతానికి చెందిన పంపన జయభారతి చిన్న కిరాణా దుకాణం నడుపుకుంటుంది. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో షాపు కట్టేసి, ఆమె బయట నిలుచున్న సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో ఉన్న నల్లపూసల దండ, మరో బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి



ఏలూరులో క్లాప్ ఆటో డ్రైవర్ల ప్రదర్శన

ఏలూరు (టూటౌన్): ఇంటింటి చెత్త సేకరించే క్లాప్ ఆటోల డ్రైవర్లను తొలగించడం సరికాదని, వెంటనే తొలగించిన క్లాప్ ఆటో డ్రైవర్లను విధుల్లోకి తీసుకోని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు తెలిపారు. అక్రమంగా విధుల నుంచి తొలగించబడిన క్లాప్ ఆటోల డ్రైవర్లు గురువారం పవర్ పేట రైల్వే స్టేషన్ వద్ద నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఫైర్ స్టేషన్ సెంటర్లో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉమామహేశ్వరరావు మాట్లాడారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్లు ఇంటింటి చెత్త సేకరించాలని క్లాప్ ఆటోలు ఏర్పాటు చేయాని, వీటి తొలగింపు వల్ల పట్టణాల్లో పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానానికి భిన్నంగా నేడు వ్యవహరిస్తోందని విమర్శించారు. క్లాప్ ఆటో డ్రైవర్ల ఉద్యమానికి అందరూ మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జానుబాబు పాల్గొన్నారు.

ఏలూరులో చైన్‌స్నాచింగ్

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ పడమరవీధి ప్రాంతంలో గురువారం చైన్‌స్నాచింగ్ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు ఏలూరు పడమరవీధికి చెందిన వృద్ధురాలు పింగళి వీరమ్మ భర్త చింతయ్యతో కలిసి జీవిస్తోంది. గురువారం ఇంటికి సమీపంలోని పాత గంగానమ్మ గుడికి వెళ్లి ఒంటరిగా నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని ఆరుకాసుల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు. బాధితురాలు ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై సూర్యచంద్ర కేసు నమోదు చేశారు.

ఉత్సవ ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలి

పట్టిసం ఉత్సవ కమిటీ చైర్మన్ ఎంబీ రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎంబీ రమణ

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లు సంబంధిత శాఖ అధికారులు సకాలంలో పూర్తి చేయాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఉత్సవ కమిటీ చైర్మన్ ఎంబీ రమణ ఆదేశించారు. ఉత్సవ ఏర్పాట్లపై పట్టిసం శివక్షేత్రం వద్ద రెండవ దఫా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిధుల విషయమై పలు శాఖలు సమస్యలను వివరించాయి. గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయకుమారి మాట్లాడుతూ ఈ ఏడాది పంచాయతీ నుంచి చేపట్టే చలువ పందిళ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు తదితర ఏర్పాట్లకు సంబంధించి రూ.28 లక్షల వరకు పాత బకాయిలు చెల్లించాల్సి ఉండటంతో టెండర్‌దారులు ఎవరూ ముందుకు రాలేదన్నారు. దేవదాయశాఖ చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ విశ్వనాథరాజు మాట్లాడుతూ తాము వాటర్ సప్లయ్, ఆదనంగా 100 మీటర్ల షామియానాలు ఏర్పాటు చేయగలమన్నారు. మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ మంగారావు మాట్లాడుతూ గతేడాది గజ ఈతగాళ్ల పడవలకు సంబంధించి రూ.3 లక్షలు బకాయిలు ఉండడంతో ఈ ఏడాది గజ ఈతగాళ్లు సుముఖత చూపడం లేదన్నారు. అనంతరం ఆర్డీవో రమణ మాట్లాడుతూ సమయం తక్కువగా ఉందని, ఖర్చు గురించి ఆలోచించకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలన్నారు. సమస్యలపై కలెక్టర్ వెట్రిసెల్వి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ బి.సాయిరాజు, ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, పాండవ్ ప్యామిలీ మెంబర్ కె.వీరభద్రరావు, దేవస్థానం ఈవో దాగంటి సురేష్‌నాయుడు, ఆర్‌అండ్‌బీ డీఈ పరిక్రష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రమేష్, ఏపీ ట్రాన్స్‌కో డీఈ ఆర్.గోపాలకృష్ణ, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో విజిలెన్స్ తనిఖీలు



ప్రాసెసింగ్ యూనిట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని జీడిపప్పు ప్రాసెసింగ్ కేంద్రాలు, డ్రైఫ్రూట్ షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. జీఎస్టీ అధికారులు, తూనికలు కొలతలు అధికారులు సంయుక్తంగా వాహిని గురు కాజు ఇండస్ట్రీ, శ్రీసాయి రాఘవేంద్ర ట్రేడర్స్, మణికృష్ణ డ్రైఫ్రూట్ షాప్, వాసిక డ్రైఫ్రూట్ షాప్‌లలో తనిఖీలు నిర్వహించినట్టు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ తెలిపారు. ఉత్పత్తులపై తయారీ తేదీ, తయారీదారుని చిరునామా, గరిష్ట చిల్లర ధర, వినియోగదారు సేవ ఫోన్ నెంబర్ వంటి సమాచారం లేదని, గుర్తింపు లేని ఎలక్ట్రానిక్ తూనికల యంత్రాలు వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉత్పత్తులు ఉండటంతో నదరు ప్రాసెసింగ్ కేంద్రాలు, డ్రైఫ్రూట్ షాపులపై తూనికలు కొలతలు చట్టం ప్రకారం 8 కేసులు నమోదు చేశామన్నారు. విజిలెన్స్ ఏవో జి.మీరయ్య, విజిలెన్స్ తహసీల్దార్ బి.శ్యామకుమార్, డీటీఏవో వినోద్‌కుమార్, తూనికలు కొలతలు అధికారి వి.ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

వేడుకగా వాసవీ మాత విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవాలు





ముత్యంగి అలంకరణలో మరకత శిల వాసవీ మాత, వాసవీ శాంతి ధాంలో పీఠాధిపతుల అనుగ్రహ భాషణ

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ వాసవీ శాంతి ధాంలో 102 అడుగుల రుగోళ్ల మందిరంలోని ప్రపంచంలో అత్యంత ఎత్తైన 90 అడుగుల వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన ఆరో వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఉదయం ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎన్ గోవిందరాజులు, ఉమా గోవిందరాజుల దంపతులు ధ్వజారోహణ, గోమాత పూజలతో వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శిష్టా మణికంఠ, ఇతర వేద పండితుల వేద మంత్రోచ్ఛారణలతో మరకత శిల వాసవీ మాతకు అభిషేకాలు, విశేష హోమాలు నిర్వహించారు. దాదాపుగా 300 మంది సువాసినులచే 102 కేజీల పసుపు, 102 కేజీల కుంకుమతో సామూహిక అర్చన నిర్వహించారు. అనంతరం సంగీత అర్చన, సామూహిక సహస్రనామ స్తోత్ర పారాయణ చేశారు.

ముత్యంగి అలంకరణలో వాసవీ మాత

వాసవీ శాంతి ధాంలోని మరకత శిల వాసవీ మాత ముత్యంగి అలంకరణలో దర్శనం ఇచ్చారు. అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించారు. తమిళనాడుకు చెందిన శ్రీశెట్టి సభ్యులు ప్రత్యేక వస్త్రధారణతో ఆలయ దర్శనంలో భాగంగా గురువారం వాసవీ మాతను దర్శించుకున్నారు. విజయవాడకు చెందిన అప్పాజీ పీఠం త్రిదండి రామానుజ అప్పాజీ సంపత్‌కుమార్ స్వామిజీ అనుగ్రహ భాషణ చేశారు. శ్రీవామనాశ్రమ స్వామీజీ, బృందావర రామానుజజీయర్, ప్రజ్ఞానంద సరస్వతీ స్వామీజీ ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వాసవీ భక్తులు పాల్గొన్నారు.

అన్న చేతిలో తమ్ముడు హతం



రమేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు, కాళ్ల ఎస్సై శ్రీనివాసరావు

కాళ్ల: స్థలం కోసం జరిగిన గొడవలో సొంత అన్నయ్య చేతిలో తమ్ముడు హతమయ్యాడు. ఈ ఘటనపై కాళ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం పెదఅమిరం గ్రామానికి చెందిన ఐవలవ రమేష్ (29), వరలక్ష్మి దంపతులు. భర్తతో మనస్పర్థల కారణంగా వరలక్ష్మి సుమారు మూడేళ్ల నుంచి పిల్లలతో కలసి పుట్టింటి వద్ద నివాసం ఉంటుంది. తమ తల్లికి చెందిన ఒక సెంటు స్థలం విషయంలో రమేష్, తన అన్నయ్య సత్యనారాయణ తరచూ గొడవలు పడుతూ ఉండేవారు. ఈ క్రమంలో 2023లో ఇద్దరు ఒకరిపై ఒకరు కేసు పెట్టుకుని కోర్టులో రాజీపడ్డారు. అయినా అప్పటి నుంచి స్థలం కోసం గొడవపడుతూ ఉండేవారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి రమేష్ తన అన్న ఇంటికి వెళ్లి గొడవపడుతున్న సమయంలో సత్యనారాయణ కర్రతో రమేష్ తలపై కొట్టడంతో తీవ్ర గాయమైంది. చుట్టుపక్కల వారు రమేష్‌ను భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్థరాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు పరిశీలించారు. రమేష్ భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

శిశు ఆధార్ సర్టిఫికెట్ సేవలు



ఏలూరు జీజీహెచ్‌లో అప్పుడే పుట్టిన శిశువుకు శిశు ఆధార్ సర్టిఫికెట్ నమోదు చేస్తున్న అధికారులు

ఏలూరు టౌన్: కేంద్ర సర్కారు నూతనంగా అమలు చేస్తున్న శిశు ఆధార్ సర్టిఫికెట్‌ను శిశువు పుట్టిన వెంటనే మంజూరు చేసేలా చర్యలు చేపట్టినట్లు ఏలూరు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు చెప్పారు. గురువారం ఏలూరు జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ వార్డులో నవజాత శిశువుకు శిశు ఆధార్ సర్టిఫికెట్‌ను నమోదు చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన శిశువులకు శిశు ఆధార్ నమోదు చేసి వారు హాస్పటల్ నుండి ఇంటికి వెళ్లే సమయంలోనే జనన ధ్రువీకరణ పత్రంతో పాటు శిశు ఆధార్‌ను ఇచ్చి పంపేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిశు ఆధార్ కోఆర్డినేటర్ డాక్టర్ లావణ్య, ఆధార్ కోఆర్డినేటర్ హరిప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్లు విజయలక్ష్మి, రంగలక్ష్మి, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు టౌన్: అప్పుల బాధ భరించలేక ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు ఇజ్రాయేల్ పేటకు చెందిన మెండాల హనుమ (25) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, 5 నెలల కుమారుడు ఉన్నారు. గురువారం తెల్లవారుజామున హనుమ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హనుమ గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో అప్పులు తీర్చలేక సతమతమవుతున్నట్లు చెబుతున్నారు.

కూలీల ఉసురు తీసిన అతివేగం

- ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొన్న కంటైనర్
- ప్రమాదంలో ఇద్దరు కూలీలు దుర్మరణం



మృతదేహాలను తరలిస్తున్న హైవే అంబులెన్స్ సిబ్బంది



క్రేన్ సహాయంతో లారీని తొలగిస్తున్న దృశ్యం

ఉంగుటూరు (గణపవరం): ఆగి ఉన్న లారీని కంటైనర్ లారీ ఢీకొనడంతో ఇద్దరు కూలీలు దుర్మరణం పాలయ్యారు. ఉంగుటూరు మండలం నాచుగుంట వద్ద ఈ ప్రమాదం జరిగింది. కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ చెందిన ఒక ఊకలారీపై కృష్ణాజిల్లా బాపులపాడు మండలం ఆరుగొలనుకు చెందిన డి.దేవమందిరం (36), గోగులమూడి విజయబాబు (38) పనిచేస్తున్నారు. ఈనెల 5వ తేదీ బుధవారం హనుమాన్ జంక్షన్‌లో ఊకలోడు చేసుకుని తాడేపల్లిగూడెంలో దిగుమతి చేసి, తిరిగి హనుమాన్‌జంక్షన్ వెళ్తుండగా, గురువారం తెల్లవారుజాము 2.30 గంటల సమయంలో ఉంగుటూరు మండలం నాచుగుంట వచ్చేసరికి లారీ బ్రేక్‌డౌన్ అయినట్లు లారీ డ్రైవర్ కిషోర్ గుర్తించారు. లారీ డ్రైవర్‌తో పాటు లారీలో ఉన్న ఇద్దరు కూలీలు లారీ దిగి లారీ క్రిందకు వెళ్లి పరిశీలిస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో వైజాగ్‌నుంచి వస్తున్న హెచ్ఆర్58బీ 4993నంబరు గల కంటైనర్ అతివేగంగా వచ్చి ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కూలీలు దేవమందిరం, విజయబాబు అక్కడికక్కడే మృతి చెందారు. అదృష్టవశాత్తూ లారీ డ్రైవర్ కిషోర్ ప్రమాదం నుంచి బయటపడ్డారు. హైవే అంబులెన్స్ వారు వచ్చి మృతదేహాలను గూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్రేన్ సహాయంతో లారీను పక్కకు తొలగించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. గాయపడిన కంటైనర్ డ్రైవర్‌ను చికిత్సనిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: ఉత్తరాఖండ్ ఐటిమలో ఈ నెల 10వ తేదీ నుంచి ఐదు రోజులపాటు నిర్వహించే 38వ జాతీయ క్రీడల్లో భీమవరం డీఎన్నార్ కళాశాల విద్యార్థులు మల్లఖంబ్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్ తెలిపారు. డిగ్రీ కళాశాలకు చెందిన కె.వేణు సాయి, ఆర్.ఏసు, డి.ప్రసాద్, ఎం.ఆదిత్యవెంకటదుర్గ, బి.సతీష్, జూనియర్ కళాశాలకు చెందిన పి.గోపీకృష్ణ, జి.దివ్యజ్యోతి, బి.గోపిక ఆదిసాయి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఫిజికల్ డైరెక్టర్ బీవీ నర్సింహరాజు చెప్పారు. ఈ సందర్భంగా గురువారం క్రీడాకారులను కళాశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ శేఖర్‌రాజు, కె.శివాజీరాజు, పి.నర్సింహరాజు, ఎం.జ్యోత్స్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగ్గన్నపేటలో విగ్రహాల గ్రామోత్సవం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ వారి ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలతో గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ నెల 8వ తేదిన ఇక్కడ విగ్రహ ప్రతిష్ట జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర పూజ, సంప్రోక్షణ, అంకురారోహణ, అగ్నిప్రతిష్ట చేశారు. ఉండి సుబ్రహ్మణ్య శర్మ, రుద్రపాక శ్రీనివాస్ శర్మ బ్రహ్మత్వంలో ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

13 మంది పాత నేరస్తులపై బైండోవర్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన 13మంది పాత నేరస్తులను గురువారం స్థానిక మండల మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. వీరికి ఏడాది కాలానికి రూ.1.50లక్షలు బాండ్ విలువలకు బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి వివరించారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్షలు తప్పవని హెచ్చరించారు.

ఎలుకల మందుపై రైతులు పూర్తి అవగాహన పొందాలి



పొలాల్లో ఎలుకల బొరియలను గుర్తిస్తున్న మండల వ్యవసాయాధికారి సారథి

పెంటపాడు: ఈనెల 7న మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించబోయే సామూహిక ఎలుకల మందు పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధి పేర్కొన్నారు. గురువారం ఆయన పెంటపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో వీఏఏల ద్వారా ఎలుకల కన్నాలను గుర్తించారు.

విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెంటపాడు: విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలని పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. డిగ్రీకళాశాల విద్యార్థిని కావ్య ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డె పరేడ్‌లో పాల్గొని తృతీయ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా కావ్యను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి రిపబ్లిక్ వేడుకల్లో ఎన్‌సీసీ విద్యార్థులు బాబి కిరణ్, చక్ర మల్లాది హజరై తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ఆవరణలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ప్రేమ్‌సాగర్, అధ్యాపకులు, రచయిత సుంకర గోపాల్, గంధం వాణి, ఎన్‌సీసీ అధికారితో పాటు, పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఇరగవరంలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఇరగవరం: మండలంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం ఇరగవరం మండలంలోని తూర్పు విప్పర్రు గ్రామంలో రామాలయం వద్ద ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 23మంది పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోసూరి రామకృష్ణానందరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు శివాలయ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు

పెంటపాడు: ప్రత్తిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించబోతున్న శివాలయ ప్రాంతాన్ని గురువారం కాకినాడకు చెందిన ఎండోమెంట్ అధికారులు పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచనల మేరకు డీఈ సైదా, డీఈఈ శ్రీనివాసాచార్యులు, కాకినాడ తపతి ఏఈ నాగేంద్రకుమార్, ప్రత్తిపాడు వై. జంక్షన్ ఈవో యాళ్ల శ్రీధర్ తదతరులు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సహకారంతో నిర్మించుకొంటున్న ఈ శివాలయానికి సీజీఎఫ్ నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు, కూటమి నాయకులు అధికారులను కోరారు. దీనిపై అధికారులు స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

- గ్రామాల్లో కొరవడిన పారిశుద్ధ్యం
- పేరుకుపోయిన చెత్తకుప్పలు
- కాలువ స్లూయిజ్‌ల వద్ద పేరుకుపోయిన కోళ్ల మూటలు
- కాలుష్య కోరల్లో అత్తిలి కాలువ
- పట్టించుకోని ఇరిగేషన్‌శాఖ అధికారులు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి గ్రామాల్లో చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



అత్తిలి మండలం ఈడూరులో స్లూయిజ్ వద్ద పేరుకుపోయిన చనిపోయిన కోళ్ల బస్తాలు

అత్తిలి: అత్తిలి మండల పరిధిలోని అత్తిలి, కంచుమర్రు, ఈడూరు పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. కాలువల్లో చెత్త పేరుకుపోయి నీరు సాఫిగా సాగడం లేదు. అత్తిలి కాలువ పరిధిలోగల బ్రాంచ్ కెనాల్స్‌లో ఎక్కడచూసిన చనిపోయిన కోళ్ల సంచుల మూటలు దర్శనమిస్తూ తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతోంది. రోజుల తరబడి కాలువల స్లూయిజ్‌లవద్ద చనిపోయిన కోళ్ల మూటలు పేరుకుపోవడంతో ఈగలు, పురుగులు పట్టి తాగునీరు కలుషితం అవుతోంది. అత్తిలి మండల పరిధిలో పాలూరు, కంచుమర్రు, ఈడూరు, ఆరవల్లి బ్రాంచ్ కాలువలు పూర్తిగా చనిపోయిన కోళ్ళు, జంతు కళేభరాలతో నిండిపోవడంతో మురుగుడ్రెయిన్ కంటే దారుణంగా మారాయి. కనీసం కాలువ నీటిలో స్నానం చేయడానికి కూడా రైతులు సాహసించడంలేదంటే కాలువనీరు ఏమేరకు కలుషితం అవుతుందో అర్ధమౌతుంది. అత్తిలి మండలంలోగల 14 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తుంటారు. 18 గ్రామాల ప్రజలకు తాగునీటి అవసరాలను అత్తిలి కాలువ తీరుస్తుంది. ఈకాలువ నీటినే గ్రామ పంచాయతీ చెరువుల్లో నింపి ఫిల్టర్ చేసి ప్రజలకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తుంటారు. గ్రామాల్లో అధికశాతం మంది పంచాయతీ సరఫరా చేసే కుళాయి నీటినే తాగునీటి అవసరాలకు వినియోగిస్తుంటారు. ఈ కలుషిత నీటిని తాగితే అనేక జబ్బులు బారిన పడే ప్రమాదం ఉంది. అయితే ఇటీవల ఫారం కోళ్లకు వైరస్ సోకి చనిపోవడంతో కొంతమంది రైతులు గోతులు తీసి పూడ్చి పెడుతుంటే, మరికొంత మంది రైతులు చనిపోయిన కోళ్లను మూటలు కట్టి అత్తిలి కాలువలో పడవేస్తున్నారు. కాలువ ఎగువ నుంచి కొట్టుకు వస్తున్న జంతు, కోళ్ల కళేభరాలు అత్తిలి కాలువ శివారు ప్రాంతాలైన ఈడూరు, కొమ్మర, కంచుమర్రు ఆరవల్లి ప్రాంతాలకు చేరుకుని స్లూయిజ్‌ల వద్ద పేరుకుపోయాయి. దీంతో ఈ ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధంతో పాటు తాగు నీరు కలుషితం కావడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి కాలువలకు వంతులవారీ విధానంలో సాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈతరుణంలో కాలువలపై ఉన్న స్లూయిజ్‌ల వద్ద జంతు కళేభరాలు పేరుకుపోవడంతో సాగునీరు సరఫరాకు ఆటంకం ఏర్పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన కోళ్లను గోతులలో పూడ్చిపెట్టాలని పశు సంవర్ధకశాఖ అధికారులు చెప్పినప్పటికీ కొంత మంది ఫౌల్ట్రీ రైతులు రాత్రి సమయాల్లో కాలువలో పడవేస్తున్నారని ఈసమస్యపై ఇరిగేషన్‌శాఖ అధికారులకు చెప్పినప్పటికీ స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్లూయిజ్‌ల వద్ద పేరుకుపోయిన చనిపోయిన కోళ్ల మూటలను ఇరిగేషన్‌శాఖ అధికారుల తొలగించి, కోళ్ల వ్యర్థాలు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



కంచుమర్రు వద్ద చనిపోయిన కోళ్ళు, జంతు కళేబరాలు



ఆరవల్లిలో కాలువ పొడవునా చనిపోయిన కోళ్ల మూటలు పేరుకుపోయిన దృశ్యం



అత్తిలి మండలం గుమ్మంపాడు లాగులు



అత్తిలి ప్రధాన కాలువలో అడ్డుపడిన చెత్త, కోళ్ల మూటలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం, పెదతాడేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈఈ కే.నరసింహమూర్తి తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదలచేశారు. దీంతో మాధవరం, ఉప్పరగూడెం, తాళ్లపాలెం, పెదతాడేపల్లి, రామన్నగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కంపోస్టు తయారీపై దృష్టి సారించాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్

తాడేపల్లిగూడెం రూరల్: పంచాయతీ సిబ్బంది కంపోస్టు తయారీపై దృష్టి సారించాలని ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ సూచించారు. గురువారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద కేంద్రాల్లో తయారు చేసిన కంపోస్టు ద్వారా కూరగాయల మొక్కలు పెంచాలన్నారు. పేడతో కంపోస్టు తయారు చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.రవి చంద్ర, కార్యదర్శి రఘు, ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులను హరిస్తే ప్రతిఘటిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): నిర్బంధాలతో కార్మిక హక్కులను కాలరాస్తే ప్రతిఘటన తప్పదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవరావు హెచ్చరించారు. ఉల్లిపాయల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ 39వ వార్షికోత్సవం గురువారం యూనియన్ ఆఫీస్‌లో జరిగింది. యూనియన్ సీనియర్ నాయకుడు దాస్యం అబ్రహం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. 2024 సంవత్సరం కార్యకలాపాలు రిపోర్టును ప్రవేశపెట్టారు. యూనియన్ సభ్యులు నివేదికను ఆమోదించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ గతంలో మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభించిందని చెప్పారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చడం శోచనీయమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రాజ్యాంగం పట్ల నమ్మకం లేదన్నారు. కార్మిక వర్గ ప్రయోజనాలను కాలరాసి పెట్టుబడిదారులకు దోసోహం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. సమ్మె హక్కును నిర్వీర్యం చేసే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారన్నారు. యూనియన్‌లను అనుమతించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రైతులకు, కార్మికులకు ఎలాంటి మేలు చేకూరదన్నారు.

నూతన కమిటీ ఎంపిక

గౌరవాధ్యక్షుడిగా సిరపరపు రంగారావు, అధ్యక్షుడిగా చల్లా చంద్రరావు, ఉపాధ్యక్షుడిగా అల్లు సుబ్బారావు, కామండర్‌గా బంకురు నాగేశ్వర రావు, సెక్రటరీగా కరక వెంకట్రావు, జాయింట్ సెక్రటరీగా సిరపు గణేష్, కమిటీ సభ్యులుగా బేత అప్పారావు, గంటా కోటి, సిరపు మహేష్, గొర్లి రమేష్, బర్ల బాలాజీ, దొర్లు సీతయ్య, సలుమూరి సత్యనారాయణ, చీర వెంకన్న వెన్నెల శ్రీను, కేతి రెడ్డి అప్పన్నలు ఎన్నికయ్యారు.

మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌గా డాక్టర్ నేతల రాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక మునిసిపల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్‌గా డాక్టర్ నేతల రాజు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. సీతానగర్ గవర్నమెంట్ ఆసుపత్రి నుంచి జనరల్ ట్రాన్స్‌ఫర్‌లో భాగంగా తాడేపల్లిగూడెం పురపాలక సంఘానికి వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు. డాక్టర్ నేతల రాజు మాట్లాడుతూ పట్టణంలోని ప్రజా ఆరోగ్యం (పబ్లిక్ హెల్త్) కోసం కృషి చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన వివరించారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి



ప్రకృతి వ్యవసాయోత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: సాగులో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి డాక్టర్ వై.నూకరాజు అన్నారు. గురువారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న కూరగాయల పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల భూమి సారం, సేంద్రియ కర్బనం తగ్గుతుందన్నారు. దీనిని పెంచడానికి పీఎండీఎస్ నవ ధాన్యాల విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. ప్రకృతి విధానంలో సాగు చేయడానికి అవసరమైన సేంద్రియ ఎరువులు, కషాయాలు, ద్రావణాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు వినియోగించుకోవాలని కోరారు. గ్రామానికి చెందిన మరిడి నాగకృష్ణ పొలంలో సాగు చేస్తున్న దొండ, బొప్పాయి, అరటి, మునగ, బీర, బంతి, ఉద్యాన పంటలను ఆయన పరిశీలించి, తెగుళ్లు సోకినట్లు గుర్తించారు. దీని నివారణకు జీవన ఎరువులైన వేప గింజల కషాయం, ఇంగువ ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. తొలుత గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయోత్పత్తుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి, ఘంటా రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



తణుకులో వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: మానవాళి పూర్తిస్థాయి ఆరోగ్యంగా ఉండాలంటే జీవన విధానంలో వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత మంచి అలవాట్లు కీలక భూమిక పోషిస్తాయని తణుక సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని దేవి దుర్గానగర్, సొసైటీ రోడ్డు, గణేష్ చౌక్ ప్రాంతాల్లో దోమకాటు వ్యాధులపైనా, వెక్టార్ కంట్రోల్ హైజీన్, లార్వా ఐడెంటిఫికేషన్ కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ముఖ్యంగా చేతుల శుభ్రత పాటించడం ఎన్నో రకాల వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చని స్పష్టం చేశారు. వండిన పదార్థాలు ఉన్న పాత్రలపై ఈగలు వాలకుండా మూతలు ఉంచడం, సమతుల ఆహారాన్ని తీసుకోవడం, రక్షిత మంచినీరు తాగడం, వ్యాయామం, మెడిటేషన్ చేయడం ద్వారా ఆరోగ్య భరోసా దక్కుతుందని అన్నారు. నిరూపయోగ సామగ్రిని ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని, చిన్న చిన్న నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, డ్రెయిన్లల్లో చెత్త వేయకుండా ఉంటే దోమ పుట్టుకకు చెక్ పెట్టవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం కె.ప్రసన్నకుమారి, వార్డు హెల్త్ సెక్రెటరీ కె.వెంకటలక్ష్మి, ఆశా కార్యకర్తలు డి.కోటేశ్వరి, వై.సువార్తమ్మ పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించాలి.. చదివించాలి



పిల్లల ఎదుగుదలపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శిశువు పుట్టిన ఆరు నెలలు వరకు తల్లి పాలు ఇవ్వాలని, ఎదుగుదల లోపం వైకల్యంలో లోపాలు వస్తాయని నిర్లక్ష్యం చేయవద్దని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఆరోగ్య కార్యకర్త డి.సూక్ష్మ మాధురి తల్లులకు అవగాహన కల్పించారు. ఐదోవార్డు అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎదుగుదలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం, బాల అమృతం అందజేస్తారని చెప్పారు. బరువు తక్కువ ఉన్న పిల్లలకు వారి ఎదుగుదలను పరిశీలించి ఎదుగుదలకు కావాల్సిన పౌష్టికాహారం అందజేస్తామని తెలిపారు. ఉచిత సదుపాయాలను పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిత కేంద్రం వల్ల ఉపయోగాలను పిల్లల తల్లిదండ్రులకు వివరించారు. టీచర్ సత్యవతి, మహిళా పోలీస్ సీహెచ్ ప్రశాంతి, రత్నకుమారి, నాగలక్ష్మి, అనిల్ కుమార్, ప్రధానోపాధ్యాయిని బి.జ్యోతి, కే.కుమారి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలనలో రైతులంతా పాల్గొనాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ మురళీకృష్ణ, పాల్గొన్న ఆర్ఎస్‌కే సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: వ్యవసాయ శాఖ తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ పరిధి తాడేపల్లిగూడెం, గణపవరం, పెంటపాడు మండలాలకు చెందిన రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో పాల్గొనాలని ఏడీఏ పి.మురళీకృష్ణ కోరారు. గురువారం సాయంత్రం తాడేపల్లిగూడెం ఏడీఏ కార్యాలయం వద్ద ఆర్ఎస్‌కే సిబ్బందికి ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదిన సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద ఎలుకల నిర్మూలన మందు పంపిణీ చేస్తారన్నారు. ఒకేసారి రైతులంతా సామూహికంగా బొరియల్లో ఎలుకల మందు పెట్టడం వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 15వ తేది లోపు ఈ-పంట, ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. గణపవరం మండల వ్యవసాయాధికారి వైవీఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఆర్ఎస్‌కే సిబ్బంది ఈ- పంటకు సంబంధించి రైతు పొలంలోనే ఫొటోలు తీయాలని సూచించారు. పెంటపాడు మండల వ్యవసాయాధికారి పార్థసారధి మాట్లాడుతూ కౌలు రైతులకు రుణాలు ఇప్పించాలన్నారు. మట్టి పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారి వెంకటరమణ, మూడు మండలాల వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో స్టెమీ వైద్యసేవలు



స్టెమీ కార్యక్రమంపై పవర్‌ప్లాంట్ ప్రజెంటేషన్ ఇస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: ఛాతీనొప్పి, గుండెపోటు సందర్భాల్లో రోగికి అవసరాన్ని బట్టి స్టెమీ సెన్సిటైజేషన్ విధానంలో ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన స్టెమీ సెన్సిటైజేషన్‌పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గుండెనొప్పితో అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చే వారికి బీపీ తదితర పరీక్షల అనంతరం కార్డియాలజీ నిపుణుల సలహా మేరకు ఈ ఇంజక్షన్ ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు. రూ. 45వేల విలువైన ఇన్‌జ్ టినెక్టెప్లేజ్ ఇంజక్షన్ ఆస్పత్రిలో అందుబాటులో ఉందని తెలిపారు. ఛాతీనొప్పి అనుమానం ఉన్నవారు తక్షణమే ఆస్పత్రికి వచ్చి వైద్యసేవలు పొందాలని సూచించారు. అనంతరం సమావేశానికి హాజరైన వైద్యవర్గాలకు ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శారదప్రసూన్న, డాక్టర్ శ్రీరాజీలు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలకు స్టెమి వైద్యంపై అవగాహన కల్పించారు.

రథసప్తమి వేడుకలను అడ్డుకున్న వ్యక్తులు



దువ్వలో ఉద్రిక్తతగా మారిన ప్రాంతంలో భక్తులు

తణుకు అర్బన్: తణుకు మండలం దువ్వలో నిర్వహిస్తున్న రథసప్తమి వేడుకల్లో గురువారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమయంలో మద్యం మత్తులో ఉన్న కొందరు వ్యక్తులు అడ్డుకుని మైకు లాక్కుని వీరంగం సృష్టించిన నేపథ్యంలో భారీసంఖ్యలో గ్రామ పజలు రావడంతో అక్కడ నుంచి జారుకున్నారు. దీంతో గ్రామస్తులు జాతీయరహదారిపై బైఠాయించి జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. రూరల్ పోలీసులు ఘటనా ప్రాంతానికి వచ్చి గొడవకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళనను విరమించారు. ఘటన జరుగుతున్న సమయంలో జాతీయ రహదారిపై భారీ ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోయింది.

వృద్ధులకు దాతల సహకారం ఎంతో అవసరం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వృద్ధాశ్రమంలో వృద్ధులకు దాతల సహాయ, సహకారాలు ఎంతో అవసరమని ఎయిర్ స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి పేర్కొన్నారు. పడాల వృద్ధాశ్రమంలో గురువారం దాతల సహాయ సహకారాలతో 70 మంది వృద్ధులకు అన్నదానం చేశారు. దాత, వాకర్స్ సభ్యురాలు దుగ్గిన వెంకట లక్ష్మి సహకరించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులను దైవంతో సమానంగా చూడాలని, పేద వృద్ధులకు ప్రతి ఒక్కరూ తప్పక సహాయం అందజేసి, ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి.గజలక్ష్మి, సీహెచ్ జ్యోతి కుమారి, కె.కనకదుర్గ, కె.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టైఫాయిడ్ వ్యాక్సిన్



తణుకు మాంటిస్సోరీ స్కూలులో టైఫాయిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమం.

తణుకు అర్బన్: సజ్జాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టైఫాయిడ్ నివారణకు ముందు జాగ్రత్త చర్యగా టైఫాయిడ్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని తణుకు మాంటిస్సోరీ స్కూలులో గురువారం నిర్వహించారు. భారత బయోటెక్ ఇంటర్నేషనల్ వారిచే రూ. 350లు విలువైన వ్యాక్సిన్‌ను కేవలం రూ.120లకు నర్సరీ నుంచి 10వ తరగతి విద్యార్థులందరికీ వ్యాక్సినేషన్ చేసినట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. డాక్టర్ గుత్తుల బాలసుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఈ వ్యాక్సినేషన్ నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు, హెడ్ మిస్ట్రస్ ఎం.లక్ష్మి, ఎగ్జిక్యూటివ్ స్కూల్ డైరెక్టర్ ఎ.జ్ఞానమంజరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్లబ్ అధ్యక్షుడు అడ్డర్ల వెంకటేశ్వరరావు, లయన్స్ జిల్లా కోఆర్డినేటర్ పుట్టా విజయశ్రీ, పుట్టా రామచంద్రరావు, భారత్ బయోటెక్ కంపెనీ ప్రతినిధులు ఆర్.రాజు, వి.మురళీ పాల్గొన్నారు.